
RNI NO. APTEL/2006/18110

నిజామాబాద్





కామారెడ్డి

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

గురువారం 04 -12-2025



## ఎన్నికల విధులను పగడ్బందీగా నిర్వహించాలి.

### గుత్పలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్.

నిజామాబాద్ బ్యూరో , డిసెంబర్ 03 ( ప్రజాగళం ) ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల జాగరూకతతో వ్యవహరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మాక్లూర్ మండలం గుత్ప గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ఫారంలు, రిజిస్టర్లను పరిశీలించారు. మొదటి రోజు సర్పంచ్, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు వచ్చిన నామినేషన్ల వివరాలను వెంటవెంటనే రోజు వారీగా ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.



# ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి.

## ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి. - అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలో కలెక్టర్.

నిజామాబాద్, డిసెంబర్ 03 ( ప్రజాగళం ప్రతినిధి) దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాలలో అద్వితీయ విజయాలను సాధించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి ఉద్బోధించారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా రంగాల్లో దివ్యాంగులు ప్రదర్శిస్తున్న ప్రతిభా పాటవాలను గుర్తు చేస్తూ వారిని కొనియాడారు. విద్యా, రాజకీయ రంగాలతో పాటు క్రీడలు, ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు ఇలా ఏ రంగంలో చూసినా దివ్యాంగులు సమాజంలోని సకలాంగులకు ఎంతమాత్రం తీసిపోకుండా తమ ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని, దివ్యాంగులను వివాహం చేసుకున్న వారికి లక్ష రూపాయల ప్రోత్సాహకం అందిస్తోందని గుర్తు చేశారు. అలాగే, స్వయం ఉపాధి కోసం ముందుకు వచ్చే వారికి తక్షణ ఆర్థిక సాయం అందేలా చొరవ చూపుతోందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఉద్దేశించిన భవిత కేంద్రాలను జిల్లాలో అన్ని వసతులతో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. భవిత కేంద్రాలతో పాటు నిజామాబాద్ నగరంలో దివ్యాంగుల కోసం ఉద్దేశించిన వసతి



ఆధ్వర్యంలో అనాథ వృద్ధుల కోసం నిర్వహించబడు తున్న వృద్ధాశ్రమాన్ని కూడా అవసరం ఉన్న వారు వినియోగించుకునేలా చూడాలన్నారు. దివ్యాంగులకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామని, సదరం సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు ఉంటే తొలగిస్తామని, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన సమయాలలో దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తామని కలెక్టర్ తెలిపారు. సంక్షేమ పథకాలు, ఉద్యోగ నియామకాల్లో దివ్యాంగులకు సముచిత ప్రాధాన్యత దక్కేలా జిల్లా యంత్రాంగం తరపున కృషి చేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. దివ్యాంగులకు ఉద్దేశించిన పథకాలు, వారి హక్కుల గురించి విరివిగా ప్రచారం చేసేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా, ప్రస్తుత పోటీ ప్రపంచంలో దివ్యాంగులు ముందుకు సాగుతూ, సమాజానికి సేవలందించేలా స్వచ్ఛంద సంస్థలు కూడా వారికి ప్రతిభ కనబరిచిన దివ్యాంగులను శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు బహూకరించారు. అలాగే దివ్యాంగులకు సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలపించిన గేయాలు ఆహుతులను అలరింపజేశాయి. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నగరంలోని దివ్యాంగుల సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో రూ.12.5 లక్షల విలువ చేసే చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ రాష్ట్ర డైరెక్టర్ కృష్ణమూర్తి, డీడబ్ల్యూఓ రసూల్ బీ, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, మమత, సైకియాట్రిస్ట్ డాక్టర్ రవితేజ, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్, ( ప్రజా గళం ): డిసెంబర్ 03 జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ లు బుధవారం పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిపించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్, అవి నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ధన్వాల్, సిబ్బంది సాత్విక్, విజేందర్ తదితరులు ఉన్నారు.

## దివ్యాంగ ఉత్తమ ఉద్యోగిగా అమ్ముల దత్తు

### -40 సార్లు రక్తదానం చేసిన దత్తు

నిజామాబాద్, ( ప్రజా గళం ): ,డిసెంబర్ 03 : అమ్ముల దత్తు ఉత్తమ ఉద్యోగిగా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నాడు. బుధవారం రోజు జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో దత్తు ను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో అయన చేసిన పనులను గుర్తు చేస్తూ కొనియాడారు. దత్తు నీటిపారుదల శాఖలో గత 16 సంవత్సరాలుగా తన విధులు నిర్వహిస్తూనే ఎన్నో సంఘసేవ కార్యక్రమాలలో పాల్గొన్నాడు. గురుకుల హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా గణిత బోధన చేశాడు. ఇప్పటివరకు 40 సార్లు రక్తదానం చేశాడు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో క్యారమ్స్, షాట్ పుట్ త్రో లలో తన ప్రతిభను కనబరిచి ప్రథమ బహుమతిని గెలుచుకున్నాడు. దివ్యాంగులకు ఆయన చేసిన సేవలను గుర్తించి జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా దివ్యాంగ ఉత్తమ ఉద్యోగిగా పురస్కారాన్ని అందుకున్నాడు.

# పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు.

నిజామాబాద్ క్రైమ్ డిసెంబర్ 3 ( ప్రజా గళం ): నిజామాబాద్ జిల్లాలో మూడు విడుతలు గా జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని ఆర్మూర్ డివిజన్ పరిధిలో 3వ విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవింద్ పేట్ గ్రామంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాలను బుధవారం పర్యవేక్షించారు. అక్కడ ఎన్నికల సందర్భంగా తీసుకుంటున్న ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఈ సదర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎటువంటి ఆరోపణలకు, అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అమలు చేస్తు, పోలింగ్ ను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్, ఆర్మూర్,



పంచాయితీలలో పటిష్టమైన బందోబస్తులు నిర్వహించడం జరుగుతుందని, పోలీస్ సిబ్బందికి నామినేషన్ సెంటర్ దగ్గరలో 100 మీ.ల లోపు నిషేధిత ఉత్తర్వులు అమలులో ఉంటాయని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, ఎస్.ఎస్.టి, ఎఫ్.ఎస్.టి ల ప్రకారం అన్ని మండలాలలో పర్యవేక్షించడం జరుతున్నాయన్నారు. సమస్యాత్మకమైనని, అతిసమ స్యాత్మకమైనవని

పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రజలందరూ ఎలప్పుడు పోలీసు అధికారులకు సహకరించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తో పాటు ఆర్మూర్ ఎ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్.హెచ్.ఓ సత్యనారాయణ గౌడ్, ఆర్.ఓ డి. సర్పయ్య ఎ.ఆర్.ఓ శ్రీనివాస్ గౌడ్, సెక్రెటరీ సుఖన్య. ప్రిన్సిపాల్ ఇందిరా సిబ్బంది పాల్గొన్నారు.

# హరిదా సరస్వతీ రాజ్ పురస్కారాలు వీరికే



ప్రజా గళం నిజామాబాద్: హరిదా సరస్వతీ రాజ్ సాహిత్య ఉత్సవం సందర్భంగా హరిదా రచయితలహొసంఘం తరఫున హరిదా సరస్వతీ రాజ్ పురస్కారాలనుహొ సంస్థ అధ్యక్షులు ఘనపురం దేవేందర్, బహుమతి ప్రదాత నవ్య భారతి గ్లోబల్ స్కూల్ అధినేత క్యాతం సంతోష్ కుమార్ లుహొ ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర విశిష్ట సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ పరిశోధకులు విమర్శకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, ఉత్తమ కథా రచయిత పురస్కారాన్ని డాక్టర్ కాలువ మల్లయ్య, ఉత్తమ వచన కవితా రచయిత చిందం రమేశ్, మహర్షి దయానందహొ సరస్వతి ద్విశతాబ్ది పురస్కారాలను ఆచార్య శ్రీధర, డాక్టర్ ఎం ఆనంద్ కుమార్ లను ఎంపిక చేసినట్టు ప్రకటించారు. జిల్లాలో సాహిత్యంలో సేవలందిస్తున్న సిర్పలింగం, మోత్కూర్ అశోక్ కుమార్, విఠం ధనంజయ్, బట్టు శ్రీధర్ రాజు, కర్క రమేష్ లకు జిల్లాస్థాయి సరస్వతీ రాజ్ హరిదా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీ గేయ రచయిత వరికుప్పల యాదగిరి, కవులు డాక్టర్ చమన్, అనిల్ ప్రసాద్, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగేశ్వర శంకరం తదితరులు హాజరవుతున్నట్టు వివరించారు.హొ ఈ కార్యక్రమం డిసెంబర్ 4న ఉదయం 10 గంటలకు నవ్య భారతి గ్లోబల్ స్కూల్లో జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని సాహితీవేత్తలు సాహిత్యాభిమానులు తెలంగాణ ఉద్యమకారులు కార్యక్రమానికి హాజరుకావాలని వారు కోరారు.

## నవీపేట్ రైల్వే గేట్ రెండు రోజులు మూసివేత

ఎడపల్లి,డిసెంబర్ 2: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ మధ్య రైల్వే డబ్లింగ్ పనులు జరుగు తున్నందున నవీపేట్ ప్రధాన రైల్వే గేట్ రెండు రోజుల పాటు మూసివేయనున్నారు.బుధవారం ఉదయం 6 గంటల నుండి గురువారంసాయంత్రం 6 గంటల వరకు నవీపేట్ రైల్వే గేట్ ను మూసివే యనున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నుంచి బాసర భైంసా ధర్మాబాద్ వైపు వెళ్లే వాహన దారులు జన్నెపల్లి మీదుగా వెళ్లాలని అలాగే బాసర్ నుంచి జానకంపేట్ బోధన్ వైపు వెళ్లేవారు ఫకీరాబాద్ సాటాపూర్ మీదుగా వెళ్లాలని వాహన దారులకు సూచించారు.



# శ్రీకాంతాచారి 16వ వర్ధంతికి ఘన నివాళులు.



బాన్సువాడ,డిసెంబర్ 3, ప్రజా గళం.: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుడు శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా బాన్సువాడలో ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం, గుర్తింపు కార్డులు, అలాగే ప్రతి ఉద్యమకారుడికి నెలకు 25,000 పెన్షన్ ఇవ్వాలని గతంలో ప్రకటిం చిన ప్రభుత్వం, రెండేళ్లు గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయ లేదని ఫోరం విచారం వ్యక్తం చేసింది. శ్రీకాంతాచారి ఆత్మ సాక్షిగా ఇప్పుడు అయినా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ కారులను గుర్తించి, ప్రకటించిన అన్ని హామీలను అమలు చేయాలని బాన్సువాడ ఉద్యమకారులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాన్సువాడ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు ఉడుత గంగాధర్ గుప్తా,మండల అధ్యక్షులు గంజివారి చందు, మీడియా ఇన్‌చార్జ్ దండు విజయ్ కుమార్, ఎదుబల్లి కృష్ణ, భాస్కర్ గౌడ్ తదితర ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రదర్శన ప్రశంసనీయం.

## - విజ్ఞాన్ మేళా ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుంట రమేష్ రెడ్డి.

నిజామాబాద్ సిటీ డిసెంబర్ 3 (ప్రజా గళం ) విజ్ఞాన్ మేళాలో విద్యార్థులు ప్రదర్శించిన తీరు ప్రశంసనీయమని సహకార బ్యాంక్ అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం లో గల ఆర్ బి వి ఆర్ ఆర్ హై స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విజ్ఞాన్ మేళా 2025-26 కార్యక్రమానికి బ్యాంక్ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి ఈ సందర్భంగా అధ్యక్షుల వారు విశిష్ట అతిథి, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేందర్ రెడ్డి ,కమిటీ సభ్యులతో కలిసి విజ్ఞాన్ మేళా 2025-2026ను ప్రారంభించి ప్రతి విద్యార్థి ప్రదర్శించిన ప్రాజెక్టులను సందర్శించారు. ఈ మేళాలో ఎల్ కే జి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులపై వారితో మాట్లాడి, ప్రాజెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి ప్రోత్సహిం చారు. ఈ విజ్ఞాన్ మేళాలో విద్యార్థులు సైన్స్, సోషల్, బయాలజీ, గణితం, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, యోగా, బోటానికల్ గార్డెన్ వంటి విభాగాల్లో ప్రాజెక్టులు ప్రదర్శించారు. అదనంగా, కొంతమంది విద్యార్థులు వైద్య సంబంధిత పరీక్షలను ప్రదర్శించారు. చైర్మన్ విద్యార్థులతో కలిసి బ్లడ్ టెస్ట్ ప్రక్రియను పరిశీలించి వారిని అభినందించారు. తదుపరి నిర్వహించిన సమావేశం లో చైర్మన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రదర్శించిన ప్రాజెక్ట్ అందర్నీ ఆకర్షించాయన్నారు., విద్యార్థుల అద్భుత ప్రతిభకు కారణమైన స్కూల్ టీచర్స్ కు రమేష్ రెడ్డి ధన్యవాదములు తెలిపారు. ఆర్ బి వి ఆర్ ఆర్ హై స్కూల్ చాలా ముందుకు సాగుతుందని, ఇదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బివిఆర్‌ఆర్ హైస్కూల్ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి , కార్యదర్శి వెంకట రమణ రెడ్డి , స్కూల్ చైర్మన్ జగత్ రెడ్డి, కమిటీ మెంబెర్స్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# సర్పంచ్,వార్డు అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు...

## - ఎడపల్లి గ్రామంలో వేడెక్కిన అభ్యర్థుల ప్రచారాలు -పోటీలో ఆరుగురు సర్పంచ్ అభ్యర్థులు.



ఎడపల్లి,డిసెంబర్ 3: (ప్రజా గళం) ప్రచారంలో దూకుడు పెంచిన సర్పంచ్ అభ్యర్థు లు,వార్డు అభ్యర్థులు. ఎడపల్లి మండల కేంద్రంలో పోటీకి సై అంటున్న స్థానిక సర్పంచ్ అభ్యర్థులకు, వార్డు సభ్యులకు బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల గుర్తులను అభ్యర్థులకు అందజేశారు. నామినేషన్ విత్‌డ్రా అనంతరం పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులకు,వార్డు అభ్యర్థులకు ఎన్నిక ల గుర్తులను కేటాయించారు. ఎడపల్లి గ్రామంలో ఆరుగురు సర్పంచ్ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. మొత్తం 14 వార్డులు ఉన్నాయి,వార్డు లలో కూడా సభ్యులు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. స్థానిక సర్పంచ్ అభ్యర్థులు గా శంకర్ నాయుడు,కందగట్ల రాంచందర్(అన్నా సేట్),షేక్. జావీద్(బాబా),ఐరెండ్ల రాజు,కటకం శంకర్,కార్కాన్ శ్రీనివాస్(అత్మేల)లు బరిలో ఉన్నారు. ఎన్నికల గుర్తులు అందుకున్న అభ్యర్థు లు ప్రచారంలో నిమగ్నమయ్యారు. వాడ వాడ, గల్లీ గల్లీలో ఓటర్ల కోసం ప్రచారాలు ప్రారంభించా రు. తమ గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఓటర్లకు వలవేస్తున్నారు, హామీలను గుప్పిస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థులు శంకర్ నాయుడుకు(టివి. రిమోట్) గుర్తు కేటాయించగా,కందగట్ల రాంచందర్(అన్నా సేట్)కు(పుట్ బాల్)గుర్తు, షేక్. జావీద్ (బాబా)కు(లేడీస్ పర్సు),అత్మేల శ్రీనివాస్(కార్కా న)కు(ఉంగరం),ఐరెండ్ల రాజుకు(కత్తెర),కటకం శంకర్ కు(బ్యాట్)గుర్తులను ఎన్నికల అధికారు లు కేటాయించారు. తమకు కేటాయించిన గుర్తు లను ఓటర్ల వద్దకు వేళ్ళి ప్రచారం చేస్తున్నారు. ఇక నువ్వా నేనా అన్నరీతిలో పోటీ ప్రారంభమైం ది. దింతో ఎన్నికల ప్రచారం వేడిఎక్కింది.

# బాపునగర్ గ్రామ సర్పంచ్,వార్డు సభ్యులకు ఏకగ్రీవమైనట్లు ధృవీకరణ పత్రం అందజేసిన రిటర్నింగ్ అధికారి....

## బాపునగర్ లో గ్రామస్తులు ఘన స్వాగతం,టపాసులు పెల్చిన యువకులు, సాయిబాబా ఆలయంలో సర్పంచ్,వార్డు సభ్యు లు ప్రత్యేక పూజలు,ఘనంగా సన్మానించిన గ్రామస్తులు....





ఎడపల్లి,డిసెంబర్ 3: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం బాపు నగర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి నగునూరి అనురాధ రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోన్స్ ప్రకటించారు. ఈ మేర కు బుధవారం ఠాణాకలాన్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సర్పంచ్ అభ్యర్థి అనురాధ రాజశేఖర్ కు సర్పంచ్ గా ఏకగ్రీవమైనట్లు ఫామ్ 10 ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అలాగే వార్డు అభ్యర్థులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు 8 మందికి ఫామ్ 10 ఫారం అందించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి జోన్,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఏక గ్రీవంగా ఎన్నికైన సర్పంచ్,వార్డు అభ్యర్థులను అభినందించారు. అనంతరం ఠాణాకళాన్ గ్రామం లోని నామినేషన్ స్వీకరణ కేంద్రం బయట ఏకగ్రీ వమైన సర్పంచ్ అనురాధ రాజశేఖర్ వార్డు సభ్యులకు స్వీట్లు పంచిపెట్టారు. వార్డు సభ్యులు కూడా సర్పంచ్ కు మీఠాయిలు తినిపించారు. బాపూనగర్ గ్రామానికి ఉత్సాహంగా చేరుకున్న సర్పంచ్,వార్డు సభ్యులకు గ్రామస్తులు ఘన స్వా గతం పలికారు. గ్రామంలో గ్రామస్తులు,యువకు లు పెద్దఎత్తున చేరుకొని డిజె పాటలతో నృత్యా లు చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. టఫాసు లు కాల్చి ఉత్సాహలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్,వార్డు సభ్యులు స్థానిక సాయి బాబా ఆలయంలో సాయినాథునికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. సర్పంచ్ గా ఏక గ్రీవమైన అనురాధ రాజశేఖర్,వార్డు సభ్యులను గ్రామస్తు లు పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు లు పులి శ్రీనివాస్,జైతాపూర్ సొసైటీ చైర్మన్ కర్బూరి సత్యనారాయణ,నాయకులు కృష్ణారావు తదిత రులు విచ్చేసి ఏకగ్రీవమైన సర్పంచ్ అనురాధ రాజశేఖర్,వార్డు సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వార్డు సభ్యు లు,పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు ఈరంటి లింగం, సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు కృష్ణారావులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఉప సర్పంచ్ కిరణ్ కుమార్, నాయకులు, గ్రామస్తు లు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# బుడిమి సర్పంచ్ అభ్యర్థిగా కమురుద్దీన్ నామినేషన్.



బాన్సువాడ, డిసెంబర్ 3, ప్రజా గళం.: బాన్సువాడ మండలం బుడిమి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి కమురుద్దీన్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. బాన్సువాడ ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్,వార్డ్ సభ్యుల నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా కమురుద్దీన్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గారి ఆశీస్సులు, పోచారం భాస్కర్ రెడ్డి గారి సహకారం, రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు గారి ఆశీస్సులు నాకు ఉన్నాయన్న నమ్మకంతో ముందుకు వస్తున్నాను" అని తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి కమురుద్దీన్ సన్నిహితులు,స్థానిక అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు ప్రకటించారు.




# ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో సర్పంచ్ అభ్యర్థికి గ్రామస్తులు మద్దతు...





ఎడపల్లి,డిసెంబర్ 2: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో పంచా యతీ ఎన్నికలు రసవత్తరంగా కొనసాగుతున్నా యి. ఈ సందర్భంగా జాన్కంపేట్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా సుంచనకోట రాధాకిషన్ గౌడ్ సతీమణి అనురాధ గౌడ్ తన గెలుపు కోసం గ్రామస్తుల మద్దతును కూడగడుతోంది. ఇప్పటికే గ్రామస్తులు పలువురు రాధాకిషన్ గౌడ్ సతీమణి గెలుపు కోసం మద్దతు తెలిపారు. ఇందులో మైనార్టీ సోద రులు సైతం వారికి మద్దతు తెలిపారు. ఈ మేరకు గ్రామస్తులు,మైనార్టీ కార్యకర్తలు పలువురు ప్రభు త్వ ముఖ్య సలహాదారు,బోధన్ ఎమ్మెల్యే పొద్దు టూరి సుదర్శన్ రెడ్డిని కలిసి సర్పంచ్ గా పోటీ చేస్తున్న రాధాకిషన్ గౌడ్ సతీమణి కి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. ఇందులో మైనార్టీ కార్యకర్తలు,దళిత నాయకులు,ముదిరాజ్ నాయ కులు, కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసి అయన సమక్షంలో తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. వారం తా సర్పంచ్ అభ్యర్థి అనురాధను గెలిపిస్తామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి వారు మాట ఇచ్చారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
గురువారం
04 -12-2025

# దివ్యాంగులకు చంద్రబాబు వరాలు.. వారికి ఉచిత బస్సు ప్రయాణం!




ప్రజాగళం, డిసెంబర్ 03:దేశంలో ఎక్కడా కూడా పింఛన్లకు రూ.6 వేలు ఇచ్చే ప్రభుత్వం లేదని, కేవలం ఏపీలోనే మాత్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రూ.3 వేల పింఛన్‌ను రూ.6వేలకు పెంచామని, 63 లక్షల 50వేల మందికి ప్రతి నెలా 1వ తేదీన ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. దివ్యాంగులపై తమ ప్రభుత్వానికి ఉన్న కమిట్‌మెంట్ ఇదని పేర్కొన్నారు. వివిధ రకాల ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. అలాగే సంవత్సరానికి రూ.6వేల కోట్లు పెన్షన్ రూపంలో అందిస్తున్నామని, బ్యాక్ లాగ్ పోస్టులకు స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ పొడిగిస్తున్నామని అన్నారు. ఎన్ని అడ్డంకులు ఉన్నా వైకల్యం అడ్డుకాదని ఎంతో మంది నిరూపించారన్నారు. అలాంటి ఆదర్శవంతులను అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. దృష్టి లోపం ఉన్నా కరుణా కుమారి పట్టుదలతో రాణించి అవార్డు సాధించారు. అంతర్జాతీయ ప్రపంచ కప్ క్రికెట్‌లో 42 పరుగులు సాధించి భారత్‌కు కప్ అందించారు. ఆమె ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివి ఈ స్థాయికి చేరిందంటే నేను గర్విస్తున్నానని చంద్రబాబు అన్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలని, అజయ్ కుమార్ రెడ్డి అర్జున అవార్డు సాధించడం గొప్ప విషయమని కొనియాడారు.

# డబ్బు డిపాజిట్ చేసేందుకు బ్యాంకుకు వచ్చిన మహిళ


ప్రజాగళం డిసెంబర్ 03:బ్యాంకులు, ఏటీఎం సెంటర్లలో ఎన్ని సీసీ కెమెరాలు పెట్టినా మోసగాళ్ల మోసాలకు అడ్డుకట్ట పడటం లేదు. డబ్బులు డిపాజిట్ చేసేందుకు డిపాజిట్ ఫారమ్ రాసిస్తామని ఓ మహిళను బురిడీ కొట్టించారు గుర్తు తెలియని దుండగులు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీ సత్యసాయి జిల్లా నల్లచెరువు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో కళ్లముందే కనికట్టు చేసినట్లు.. డబ్బులు ఎత్తుకెళ్లినా ఓ మహిళ గుర్తించలేకపోయింది. నల్ల చెరువుకు చెందిన రమణమ్మ అనే మహిళ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో 50 వేల రూపాయలు డిపాజిట్ చేసేందుకు బ్యాంకుకు వచ్చింది. డిపాజిట్ ఫారమ్ నింపిన రమణమ్మ 50 వేల రూపాయలతో పాటు డిపాజిట్ ఫారమ్, పాస్ బుక్ చేతిలో పట్టుకుని ఉంది. అంతలోనే ఓ ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తన దగ్గరకు వచ్చి డిపాజిట్ ఫారమ్ రాస్తామని చేతిలో ఉన్న పాస్ బుక్‌తో పాటు డబ్బులు కూడా తీసుకోగా.. అప్పటికే డిపాజిట్ ఫారమ్ రాశానని చెప్పినా.. పాస్‌బుక్‌తో పాటు గుర్తు తెలియని దుండగులు డబ్బులు తీసుకున్నారు.కళ్ళముందే కనికట్టు చేసినట్లు రమణమ్మ అనే మహిళను మాటలతో ఏమార్చి 50 వేల రూపాయల కట్టలో 18 వేల రూపాయలు కొట్టేశారు. డబ్బులు తీసుకున్న దుండగులిద్దరూ హడావుడిగా బ్యాంకు నుంచి బయటకు నడుచుకుంటూ పారిపోయారు. అటు బాధితురాలు రమణమ్మ క్యాష్ కౌంటర్ దగ్గరికి వెళ్లి పాస్‌పుస్తకంతో పాటు డిపాజిట్ ఫారమ్, నగదు క్యాష్ కౌంటర్లలో ఇచ్చింది. అయితే డిపాజిట్ ఫారమ్‌లో 50 వేల రూపాయలు రాసి ఉండగా నగదులో 18 వేల రూపాయలు తగ్గాయని క్యాషియర్ రమణమ్మకు చెప్పడంతో.. తన దగ్గరకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులే డబ్బులు కొట్టేశారని గుర్తించింది. తన దగ్గరకు వచ్చి మాటల్లో పెట్టి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు కొట్టేశారని బాధితురాలు రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బ్యాంకు లోపలికి వచ్చి డబ్బులు కొట్టేసిన తర్వాత బయటకు వెళుతున్న నిందితుల దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. దీంతో సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. దొంగలు ఉంటారు జాగ్రత్త.! అని బ్యాంకులలో ఎన్ని నోటీసు బోర్డులు పెట్టినా.. దొంగలు నేరుగా బ్యాంకులలోకి వచ్చి తమ చేతివాటం చూపిస్తున్నారు. ఏకంగా బ్యాంకులోకే దర్జాగా వచ్చి ఖాతాదారుల కళ్ళముందే డబ్బులు కొట్టేస్తున్నారు అంటే ఎంత ధైర్యం.!

## వెలుగులోకి నెల్లూరు 'నేర' జాన కామాక్షి అరాచకాలు..!

ప్రజాగళం డిసెంబర్ 03:నెల్లూరులో సంచలనం సృష్టించిన హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయిహౌసింగ్ బోర్డ్ కాలనీలో సీపీఎం నాయకుడు పెంచలయ్య అనే వ్యక్తిని దాదాపు పదిమంది కత్తులతో నరికి చంపారు. ఆ సమయంలో ఇది రెండు వర్గాల మధ్య జరిగిన వివాదాల కారణంగా పాత కక్షలతో జరిగిన హత్య అని అందరూ అనుకున్నారు. ఆ తర్వాతే ఒక్కొక్క విషయం బయటపడుతూ షాకింగ్ నిజాలు బయటకు వచ్చాయి. నెల్లూరులో అప్పటిదాకా ఎవరూ ఊహించని ఓ మహిళ నెలకొల్పిన నేర సామ్రాజ్యం తాలూకు వాస్తవాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.నెల్లూరు జిల్లాలో గత కొద్దిరోజులుగా నేర ప్రవృత్తి పెరిగిపోతోంది.అది కూడా మహిళలు నెలకొల్పిన నేర సామ్రాజ్యాలు బయటపడుతున్నాయి. తరచూ ప్రజలు ఉలిక్కిపడే ఘటనలు జరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం నెల్లూరు జిల్లాలో రౌడీ షీటర్ శ్రీకాంత్ అతని ప్రియురాలు నిడగుంటఅరుణ వ్యవహారం మరిచిపోకముందే, మరో లేడీ డాన్ వ్యవహారం బయటకు వచ్చింది. ఐదు రోజుల క్రితం జరిగిన పెంచలయ్య హత్య కేసులో కూపీ లాగిన పోలీసులకు అరవ కామాక్షి అనే మహిళ ఆగడాలను పోలీసులు గుర్తించారు.నెల్లూరు నగరంలోని బోడిగానితోటలో నివాసం ఉంటున్న అరుణ గంజాయి దందా నిర్వహిస్తోంది. పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టగా షాకింగ్ విషయాలు బయటకు వచ్చాయి. అరవ కామాక్షికి వంశపారపర్యంగా ఆస్తులు సంక్రమించినట్లు నేర ప్రవృత్తి కూడా అలాగే వచ్చినట్లు తేలింది.ఆమె తల్లిదండ్రులు గతంలో ఈ రకమైన దందాలు ముఠా ఏర్పాటు చేసుకుని దాడులు, దోపిడీలకు పాల్పడే చరిత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. నగరంలో వీధుల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకుని అమ్ముకునే వృత్తిలో ఉంటున్న చిన్నపిల్లలను చేరదీసేది. వారి ద్వారా జూనియర్ కాలేజీలు,ఇంజనీరింగ్ కాలేజీల వద్ద చివరకు పాఠశాల వద్ద విద్యార్థులకు గంజాయి అమ్మకాలు చేయిస్తున్నట్లు తేలింది.నెల్లూరు నగరంలోని 14 విద్యాసంస్థల వద్ద కామాక్షికి చెందిన వ్యక్తులు గంజాయి అమ్మకాలు సాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వందలాది మంది విద్యార్థులు కామాక్షి చేస్తున్న దందాలో చిక్కుకున్నారు. విద్యార్థులు గంజాయి సేవించేవారని తెలియడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. విద్యా సంస్థల వద్ద నిత్యం సంచరించే అనుమానిత వ్యక్తుల పట్ల పోలీసులు నిఘా ఉంచారు.ఒక నెల్లూరు నగరంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాలకు గంజాయి విక్రయించే ముఠాలకు కామాక్షి పెద్ద మొత్తంలో గంజాయి సరఫరా చేసేదని తెలుస్తోంది.

# ఏపీలో దడ పుట్టిస్తున్న కీటకం.. ఇద్దరు మృతి.

ప్రజాగళం డిసెంబర్ 03:ఏపీలో కొత్త రకం స్క్రబ్ టైఫస్ వ్యాధి సంచలనం సృష్టిస్తోంది. స్క్రబ్ టైఫస్ లక్షణాలతో ఇద్దరు మృతి చెందగా, మరొకరి చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే.. చిత్తూరు,కాకినాడ,విశాఖ, విజయనగరంజిల్లాల్లో కేసులు బయటపడ్డాయి. విశాఖలో రెండు నెలల్లో 43 పాజిటివ్ కేసులు రికార్డ్ అయ్యాయి. దీనికి సంబంధించి విశాఖ కేజీహెచ్ వైరాలజీ ల్యాబ్‌లో ప్రైమరీ టెస్టులు నిర్వహిస్తున్నారు.ఇలాంటి సమయంలోనే పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కలకలం రేపింది. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని జ్యోతి జ్వరం,ఒళ్లునొప్పులతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 20 రోజుల క్రితం మరణించింది. రాజుపాలెంకు చెందిన వృద్ధురాలు నాగమ్మ కూడా జ్వరంతో చికిత్స పొందుతూ 20రోజుల క్రితం మృతి చెందిందిఇప్పుడు రాజుపాలెం మండలం కొత్తూరుకు చెందినసాలమ్మ అనే మరో వృద్ధురాలు కూడా స్క్రబ్ టైఫస్ లక్షణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడం టెన్షన్ పెడుతోంది.అయితే.పల్నాడు జిల్లాలో కొద్దిరోజులక్రితం ప్రాణాలు కోల్పోయిన జ్యోతి, నాగమ్మ శాంపిల్స్‌ను టెస్టుల కోసం ముంబై పంపగా. స్క్రబ్ టైఫస్‌తో మృతి చెందినట్లు తేలడంతోస్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.ఇక.స్క్రబ్ టైఫస్‌బారినపడి విజయనగరంలోనూ మూడు రోజుల క్రితంఓ మహిళ ప్రాణాలు కోల్పోయారు.నల్లిని పోలిన ఓ కీటకం కుట్టడంతో ఈ వ్యాధి సోకుతుందని వైద్యులు తెలిపారు.శరీరంపై ఒకచోట దద్దులు రావడంతోపాటు.నల్లటి మచ్చ ఏర్పడితే స్క్రబ్ టైఫస్ లక్షణంగా గుర్తించాలన్నారు. ఈ వ్యాధికి




సంబంధించి మొదట్లో తీవ్ర జ్వరం, వాంతులు, తలనొప్పి,ఒళ్లు నొప్పులు, పొడిదగ్గు లక్షణాలు కనిపిస్తాయని విశాఖKGHసూపరింటెండెంట్‌వాణి తెలిపారు.మరోవైపు.. ఎలుకలు సంచరించే ప్రాంతాలు, పొలాలు, పొదలు, గడ్డివాములు ఉండే చోట్ల స్క్రబ్ టైఫస్ వ్యాధి ఆనవాళ్లుంటాయి. ఇళ్లల్లో పాత మంచాలు, పరుపులు, దిండ్లలోకి చొరబడే ప్రమాదం ఉంది. మొత్తంగా.. చిత్తూరు, కాకినాడ, విశాఖ, విజయనగరం, పల్నాడు జిల్లాల్లో వరుసగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు నమోదు అవుతుండడం ఏపీని టెన్షన్ పెడుతోంది.

# యూట్యూబ్‌లో పాఠాలు చూసి ఇద్దరు యువకులు ఏం చేశారంటే..

ప్రజాగళం డిసెంబర్ 03:యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను ఉపయోగించుకుని కొంతమంది విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటుంటే.. మరికొంతమంది చోరకళనుఅభ్యసించడంలో ఆరితేరుతున్నారు.. జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం యూట్యూబ్‌లో బైక్‌లు చోరీ చేయడం ఎలా అన్న విద్యను అభ్యసించాడో చోరకళా శిఖామణి.. కేవలం ఒక్క పిన్నీసుతో బైక్‌లను స్టార్ట్ చేసిఎత్తుకెళుతున్నారు అన్నదమ్ములు.. యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను ఉపయోగించుకుని కొంతమంది విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటుంటే.. మరికొంతమంది చోరకళను అభ్యసించడంలో ఆరితేరుతున్నారు.జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం యూట్యూబ్‌లో బైక్‌లు చోరీ చేయడం ఎలా అన్న విద్యను అభ్యసించాడో చోరకళా శిఖామణి.. కేవలం ఒక్క పిన్నీసుతో బైక్‌లను స్టార్ట్ చేసి ఎత్తుకెళుతున్నారు అన్నదమ్ములు.అందుకు ఇంకా ఈజీగా ఉండేందుకు తాళం వేయని బైక్‌లను టార్గెట్ చేసి సునాయాసంగా బైక్‌లను చోరీ చేస్తున్నారు.. ఇలా 11 బైక్‌లను చోరీ చేసిన ఇద్దరు దొంగలు.. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలైన ఘటన ఏపీలోని ప్రకాశం జిల్లా పుల్లల చెరువులో చోటు చేసుకుంది. 2025 నవంబర్ 29వ తేది సాయంత్రం 6 గంటల సమయములో ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం పాతచెరువు తండాకు చెందిన తన బైక్‌ను ఆర్టీసీ ఆవరణలో పార్క్‌చేసి వెళ్ళాడు.తిరిగివచ్చి చూస్తే బైక్ కనిపించలేదు.. అదేరోజు రాత్రి తన బైక్ కనిపించడం లేదని పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇటీవల ఎక్కువగా బైక్‌లు చోరీకి గురవుతుండటంతో తాజాగా వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. మార్కాపురం డిఎస్‌పి నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి బైక్‌లను చోరీ చేస్తున్న ముఠాలపై నిఘా పెట్టారు. పుల్లలచెరువు ఎస్ఐ సంపత్ కుమార్, సిబ్బంది నేరం జరిగిన తీరును విశ్లేషిస్తూ, కేసును నిరంతరం రివ్యూ చేశారు. నేరం జరిగిన స్థలంలో సిసి కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాలను సేకరించి దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో ముద్దాయిల సమాచారాన్ని సేకరించి ఈరోజుపుల్లలచెరువు మండలంలోని





ముటుకుల గ్రామ శివార్లలో ఇద్దరు నిందితులు వేణు, సన్నీలను అరెస్ట్ చేశారు.. 10 లక్షల విలువైన మొత్తం 11 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.పల్నాడు జిల్లా వినుకొండ మండలం గణేశ్‌పాలెం గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు వేణు, సన్నీ మద్యం ఇతర జల్సాలకు అలవాటు పడ్డారు. తమ సంపాదన సరిపోకపోవడంతో త్వరగా డబ్బు సంపాదించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో హ్యాండ్ లాక్ వేయని బైక్‌లను చోరీలు చేసి సొమ్ము చేసుకోవాలని ప్లాన్ వేశారు.. అందుకు యూట్యూబ్‌లో పిన్నీసుతో బైక్‌లను ఎలా స్టార్ట్ చేయాలో నేర్చుకున్నారు.. ఆ తరువాత ఇక చేతివాటం ప్రదర్శించి కేవలం పిన్నీసుతో 11 బైక్‌లను చోరీ చేశారు. ఇలా పుల్లలచెరువు, యర్రగొండపాలెం, దొనకొండ, మార్కాపురం రూరల్, పాత గుంటూరు , పిడుగురాళ్ల, కారంపూడి, నాగార్జునసాగర్, తెలంగాణ, హాలియా బస్టాండ్ దగ్గర బైక్‌లను చోరీ చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఈ కేసులో కీలక ఆధారాలు సేకరించి నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని మార్కాపురం డిఎస్‌పి నాగరాజు అభినందించారు.

# పాదయాత్ర 2.0..

# జగన్ వ్యూహం అదేనా? వైసీపీని తిరిగి పవర్‌లోకి తెస్తుందా?

ప్రజాగళం డిసెంబర్ 03:అది మామూలు ఓటమి కాదు. గెలుపు కూడా అంతే రీసౌండ్ చేయాలి. కమ్ బ్యాక్ ఆ ఓటమిని మరిపించేలా ఉండాలి. బౌన్స్ బ్యాక్ హిస్టరీని రిపీట్ చేయాలి. ఇదే ఎజెండాతో ఉన్నారట వైసీపీ అధినేత జగన్. మళ్లీ పవర్‌లోకి వచ్చి సత్తా చాటాలని స్కెచ్ వేస్తోన్న ఫ్యాన్ పార్టీ అధినేత..టూ ఇయర్స్ ప్లాన్‌ను రెడీ చేసి పెట్టుకున్నారట. ఎన్నికలకు ముందు రెండేళ్లు జనంలోనే ఉండేలా షెడ్యూల్ ప్రిపేర్ చేసి పెట్టుకున్నారట. ముందు జిల్లాల టూర్, ఆ తర్వాత పాదయాత్రతో ప్రజాక్షేత్రంలోనే గడిపేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నారట. ఇంతకు జగన్ ప్లానేంటి? అధినేత పాదయాత్ర వైసీపీని తిరిగి పవర్‌లోకి తెస్తుందా? సైలెంట్‌గానే ఉన్నారు. అప్పుడప్పుడు సమయం సందర్భం చూసి మాట్లాడుతున్నారు. అలా అని తమ అధినేత లైట్ తీసుకోలేదంటున్నారు ఫ్యాన్ పార్టీ లీడర్లు.2029లో ఫ్యాన్ స్పీడును తట్టుకోవడం ఎవరి తరం కాదని..మళ్లీ అదే స్థాయిలో తిరిగి పవర్‌లోకి వస్తామని ధీమాగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే పార్టీని సెట్‌రైట్ చేసే పనిలో ఉన్నారట వైసీపీ అధినేత జగన్. ముందుగా నియోజకవర్గ ఇంచార్జ్‌లను మారుస్తూ..పనిచేస్తూ వారికి దిశానిర్దేశం చేస్తూ..తాను గ్రౌండ్‌లోకి దిగే నాటికి అంతా సిద్ధంగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారట. న్యూఇయర్‌లో సరికొత్తగా..అంటే కూటమి రెండేళ్ల పాలన పూర్తయ్యే నాటికి జగన్ దూకుడు పెంచుతారని అంటున్నారు. వచ్చే ఏడాది సమ్మర్‌లో మొదట జిల్లాల టూర్‌కు ప్లాన్ చేస్తున్నారట జగన్. అంతలోపే అన్ని నియోజకవర్గాలకు ఇంచార్జ్‌ల నియామకం పూర్తి..సమన్వయకర్తలను యాక్టీవ్ చేయడంతో పాటు..పోరుబాటతో నిత్యం ప్రజల్లో ఉండేలా వ్యూహరచన రెడీ చేసి పెట్టారట. జిల్లాల టూర్ అయిపోగానే..పాదయాత్రకు శ్రీకారం చుట్టబోతున్నారట జగన్.ఈ 15 నెలల కాలంలో వైసీపీ పెద్దగా ఆందోళన కార్యక్రమాలేం చేపట్టలేదు. ఓటమి నుంచి తేరుకోవడానికి చాలా టైమ్ పట్టింది. ఆ తర్వాత కూటమి ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిద్దామంటే నేతలను కేసులు వెంటాడాయి. చాలా నియోజకవర్గాల్లో లీడర్లు యాక్టీవ్‌గా లేరు. క్యాడర్ నైరాశ్యంలో ఉంది. ఇంకో రెండు మూడు నెలలు అయితే అందరూ రంగంలోకి దిగుతారని..ఆ తర్వాత అధినేత ఫీల్డ్‌లోనే ఉంటారని అంటున్నారు. మరోసారి పాదయాత్రకు సిద్ధమవుతున్నారట జగన్. 2019 ఎన్నికలకు ముందు దాదాపు 3వేల 650 కిలోమీటర్లు పాదయాత్ర చేసి 151 సీట్లతో అధికారాన్ని చేపట్టిన జగన్..మళ్లీ అధికారంలోకి రావాలంటే పాదయాత్ర ఒక్కటే మార్గంగా భావిస్తున్నారట. తెలుగు రాష్ట్రాల్లో పాదయాత్ర చేసిన ప్రతి నాయకుడు తదుపరి ఎన్నికల్లో గెలుస్తున్నారనే సెంటిమెంట్ కూడా జగన్‌ను రెండోసారి పాదయాత్ర చేసేలా ఉసిగొల్పుతోందని అంటున్నారు. ఈసారి దాదాపు 5వేల కిలోమీటర్ల పాదయాత్ర చేయాలని భావిస్తున్న జగన్..ఇప్పటి నుంచి పాదయాత్ర ఏర్పాట్లు, రూట్ మ్యాప్‌పై దృష్టి పెట్టారని టాక్.2029 ఎన్నికల వరకు జనంలోనే ఉండాలనుకుంటున్న జగన్.. అదును చూసి అతిపెద్ద అస్త్రంతో రంగంలోకి దిగుతారని అంటున్నారు. సరిగ్గా ఎన్నికలకు రెండేళ్ల ముందు పాదయాత్రను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయట. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర మాత్రమే అయింది. మరో ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర స్టార్ట్ చేసి ఎన్నికల నోటిఫికేషన్ వరకు జనంలోనే ఉండాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ నిర్ణయించారని అంటున్నారు.జగన్ సీఎం అయిన తర్వాత ప్రజలతో గ్యాప్ పెరిగిందని..2024లో అధికారం కోల్పోవడానికి అది కూడా ఓ కారణంగా చెబుతున్నారు. సాధారణ జనానికే



కాదు..ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా తగిన సమయం ఇచ్చే వారు కాదన్న ప్రచారం జనంలోకి బలంగా వెళ్లింది. అప్పటి ప్రతిపక్షం కూడా ఇదే అంశాన్ని ఎక్కువగా ప్రచారం చేసింది. అయితే ఈ ప్రచారానికి చెక్ పెట్టాలన్న ఆలోచనతో ఉన్న జగన్.. తానెప్పుడూ జనం మనిషినే అని నిరూపించుకోవాలని భావిస్తున్నారట. అందుకే 2.0 పాదయాత్రను బిగ్ స్కేల్‌లో ప్లాన్ చేస్తున్నారట. రాష్ట్రంలోని ప్రతి జిల్లా.. ప్రతి మండలం టచ్ చేసేలా మొత్తం 175 నియోజకవర్గాలు కవర్ చేసేలా పాదయాత్రను డిజైన్ చేయాలని జగన్ పార్టీ నేతలను ఆదేశించినట్లు ఇన్‌సైడ్ టాక్. జగన్ 2 ఇయర్స్ ప్లాన్ ఎంతవరకు వర్కౌట్ అవుతుందో..పాదయాత్ర ఆయనను తిరిగి పవర్‌లోకి తీసుకొస్తుందో లేదో చూడాలి.